## రామతీర్థంలో జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు



**విడవలూరు, మే 29 ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలోని శ్రీ గంగా సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని నెల్లూరు జిల్లా కోర్టు జడ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న జడ్జి దంపతులకు ఆలయ ప్రతినిధులు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మస్తానయ్య, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కండలేరులో 39.220 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, మే 29, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో శుక్రవారం ఉదయానికి 39.220 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జలాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, కండలేరు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1280 క్యూసెక్కులు, హెడ్ రెగ్యులేటర్ పవర్ హౌస్ ద్వారా 710 క్యూసెక్కులు చొప్పున మొత్తం 2040 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

# పల్లె వీక్షణతో గ్రామ సమస్యలకు సత్వర పరిష్కారం

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల
- కొమ్మిపాడులో కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యటన





**సైదాపురం, మే 29, ప్రభాతవార్త** వారంలో ఒకరోజు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఒక గ్రామానికి వచ్చి, ఆ గ్రామస్తుల సమస్యలను నేరుగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా జిల్లాలో పల్లె వీక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. శుక్రవారం సైదాపురం మండలం కొమ్మిపాడు గ్రామంలో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణతో కలిసి కలెక్టర్ పల్లె వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఉపాధి హామీ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి పనుల నాణ్యతపై అధికారులకు సూచనలు చేశారు. సమీపంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మమేకమై వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రంలో నిమ్మ రైతులతో కలెక్టర్ మమేక మయ్యారు. నిమ్మ సాగు విధానం, మార్కెటింగ్, లాభాలపై ఆరా తీశారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి గ్రామంలో నిమ్మ, మామిడి సాగు వివరాలను కలెక్టర్‌కు వివరించారు. గత ఏడాది ప్రయోగాత్మకంగా చేపట్టిన సాంకేతిక విజ్ఞానంతో నిమ్మ సాగులో మెరుగైన ఫలితాలు వచ్చాయని, ఇదే విధానాన్ని రైతులందరూ అవలంబించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పీఎండీఎస్ విత్తనాలను ఎమ్మెల్యే, కలెక్టర్ రైతులకు పంపిణీ చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామ ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

**గ్రామస్తులతో ముఖాముఖి... అర్జీల స్వీకరణ** అనంతరం జిల్లాస్థాయి అధికారులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి పలు అర్జీలు స్వీకరించారు. అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు తెలిపిన ప్రతి సమస్యను క్షుణ్ణంగా ఆలకించిన కలెక్టర్, ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మీడియాతో మాట్లాడుతూ** ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నూటికి నూరు శాతం సమర్థవంతంగా అమలు చేస్తూ అర్హులందరికీ అందేలా పర్యవేక్షించడమే పల్లె వీక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సంతృప్తి స్థాయిని స్వయంగా తెలుసుకుని, ఎక్కడైనా లోపాలు ఉంటే చక్కదిద్దేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ గ్రామంలో రైతులు ప్రధానంగా నిమ్మ పంటపై ఆధారపడి ఉన్నారని, ఇది వర్షాధార గ్రామమని తెలిపారు. జలధార కార్యక్రమం ద్వారా గ్రామంలో జలవనరుల అభివృద్ధికి అనేక పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామ పర్యటనలో అంగన్వాడీ కేంద్రం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణం, ఓహెచ్ఆర్ ట్యాంక్ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణ పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన రూ.2.60 లక్షలను తక్షణమే మంజూరు చేశారని, సిమెంట్ రోడ్డు నిర్మాణానికీ ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ వెల్లడించారు. గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారని చెప్పారు.

❖ గ్రామంలో సుమారు 80కి పైగా అర్జీలు అందాయని, కొన్ని సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించామని, మరికొన్నింటికి నెలరోజుల్లో పరిష్కార మార్గం చూపిస్తామని కలెక్టర్ తెలిపారు. ఒక గ్రామానికి సుమారు 30 శాఖల అధికార యంత్రాంగం నేరుగా వచ్చి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

**- రెండు సంవత్సరాల్లో రూ.136 కోట్ల అభివృద్ధి పనులు - ఎమ్మెల్యే రామకృష్ణ** వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరించే సరికొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గత పరిపాలనకు, ప్రస్తుతం జరుగుతున్న పరిపాలనకు తేడాను ప్రజలు గమనించాలని సూచించారు. సైదాపురం మండలంలో గత రెండేళ్లలో రూ.136 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని, కొమ్మిపాడు గ్రామంలోనే రూ. 3.42 కోట్ల అభివృద్ధి పనులు నిర్వహించినట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అండగా నిలిచామని, మండలంలో ఇప్పటివరకు రూ.1.10 కోట్ల చెక్కులు అందించినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో పల్లె వీక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సైదాపురం మండలంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. పలువురు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.

❖ ఆర్డిఓ అనూష, డిపిఓ వసుమతి, డిఆర్ డి ఏ పీ డీ నాగరాజు కుమారి, ఐసిడిఎస్ పీ డీ హేన సుజన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవ శాఖ అధికారి సుబ్బారెడ్డి, డీ ఏం అండ్ హెచ్ ఓ సుజాత, విద్యుత్ శాఖ ఎస్ఈ రాఘవేంద్ర ఎంపీడీవో రామ్మోహన్ రెడ్డి, తహసిల్దార్ ఏం సుభద్ర, వివిధ శాఖల అధికారులు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమలపై సిబిఐ విచారణ జరిపించాలి కాకాణి



**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త** డీఎస్సీ 2025 పరీక్షల నిర్వహణ, అభ్యర్థుల ఎంపికలో అవకతవకలకు పాల్పడటంతో అర్హులకు అన్యాయం జరుగుతుందంటూ నెల్లూరు నగరంలోని వి ఆర్ సి కూడలి వద్ద డా.బి.ఆర్.అంబేద్కర్ గారి విగ్రహం వద్ద శాంతియుత నిరసన తెలియజేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులను అక్రమంగా పోలీసులు అరెస్టు చేసి ఒకటో నగరం పోలీస్ స్టేషన్ కు తరలించడంతో హుటాహుటిన పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న మాజీ మంత్రివ నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా॥ కాకాణి గోవర్ధన్ రెడ్డి మాజీ మంత్రి కాకాణి పోలీస్ స్టేషన్ కు వస్తున్నారని తెలిసి విద్యార్థి విభాగం నాయకులను వదిలేసి, పోలీస్ స్టేషన్ నుంచి త్వరగా వెళ్లిపోవాలని చెప్పిన పోలీసులు పోలీస్ స్టేషన్ దగ్గరకు చేరుకున్న కాకాణికి కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ని దగా డిఎస్సీగా మార్చేసిందని నిరసన చేపబడితే, పోలీసులు దుర్మార్గంగా అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్ కు తరలించిన వైనాన్ని కాకాణికి వివరించిన విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డి, తదితరులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డి తోపాటు, విద్యార్థి విభాగం నాయకులను, విద్యార్థులను, అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడాన్ని తీవ్రంగా నిరసిస్తూ, విద్యార్థి విభాగం నాయకులకు అండగా నిలిచి, కూటమి ప్రభుత్వంపై, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన కాకాణి

**కాకాణి మాట్లాడుతూ** చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో అవకతవకలకు పాల్పడుతుంది. మెగా డీఎస్సీ పేరుతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులను చంద్రబాబు ఘోరంగా వంచించాడు 2025లో విడుదల చేసిన డీఎస్సీ ప్రకటనకు సంబంధించి, ఉపాధ్యాయుల నియామకాల్లో నిరుద్యోగులకు అనేక అనుమానాలు, అపోహలు నెలకొన్నాయి డీఎస్సీ అంటేనే "డిస్టిక్ సెలెక్షన్ కమిటీ" , ప్రస్తుతం ఈ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ గానీ, జిల్లా స్థాయి అధికారులు గానీ ఎక్కడైనా జోక్యం చేసుకుంటున్నారా? డీఎస్సీ నియామకాల వ్యవహారమంతా కేవలం ఒక ఖిరిమోట్ కంట్రోల్‌ఖి పాలనలా సాగుతోంది , అసలు జిల్లాలల్లో కలెక్టర్లు ఉన్నారా లేదా అనే సందేహం కలుగుతోంది అసలు కలెక్టర్ల వ్యవస్థను తీసేశారా లేదా డీఎస్సీ అబ్రివేషన్‌నే మార్చేశారా? రాష్ట్రంలో వ్యవస్థలన్నీ పూర్తిగా మారిపోయాయి వీఆర్వో దగ్గర నుంచి, ఎంఆర్ఓ, జిల్లా కలెక్టర్, చివరకు చీఫ్ సెక్రెటరీ దాకా.. అందరిపై మంత్రి నారా లోకేశ్ పెత్తనం నడుస్తోంది. పోలీస్ శాఖలోనూ హోంగార్డ్, కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ, సీఐ, డీఎస్పీ, ఎస్పీ, డీజీపీ దాకా అంతా లోకేశ్ కనుసన్నల్లోనే వ్యవహారాలు నడుస్తున్నాయి. అందుకే ఇక్కడ అధికారులు ఎవరూ ఉన్నట్టుగా కనిపించడం లేదు. డీఎస్సీ ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయి, ఈ అక్రమాలపై వాస్తవాలు బయటకు రావాలంటే సిబిఐ తో నిష్పాక్షిక విచారణ జరిపించాలి విద్యార్థి నాయకులు ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించారా, లేదా దౌర్జన్యాలు చేశారా? కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదన్నట్టుగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గంవిద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించే వ్యక్తికి సమాజంపై, విద్యా వ్యవస్థపై సమగ్రమైన అవగాహన ఉండాలి ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన కన్వీనర్‌ను మధ్యలోనే అర్థాంతరంగా ఎందుకు మార్చాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలి ఉద్యోగ నియామకాల్లో ఇంతమంది శాశ్వత ఉద్యోగులు ఉండగా, వారిని పక్కన పెట్టి తాత్కాలిక ఉద్యోగుల చేత ఎందుకు ఈ ప్రక్రియను నిర్వహించారు? క్వశ్చన్ పేపర్ అప్‌లోడ్ చేసిన తాత్కాలిక ఉద్యోగికి జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రంలో టాప్ ర్యాంక్ రావడం వెనుక ఉన్న రహస్యం ఏమిటి?" సదరు వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం వెబ్‌సైట్ నుండి ఎందుకు తొలగించిందో స్పష్టం చేయాలి పరీక్ష రాసిన అభ్యర్థులందరికీ సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను వెబ్‌సైట్‌లో పెట్టి, కేవలం 24 గంటల్లోనే ఎందుకు తొలగించారు? మెరిట్ జాబితాను ప్రకటించకుండా, అభ్యర్థులకు ఉద్యోగం వచ్చిందని మొదట ఎస్ఎంఎస్‌లు (ఖిఖిఖి) పంపి, .. "అవి కేవలం టెస్ట్ ఎస్ఎంఎస్‌లు మాత్రమే, మీకు ఉద్యోగం రాలేదు" అని చెప్పడం అభ్యర్థులను మోసం చేయడమే, వీటికి సంబంధించి అడిగేందుకు మా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి వెళితే వారి పట్ల అవమానకరంగా ప్రవర్తించారు దీనిపై సమాధానం చెప్పాల్సిన కమిషనర్ , తనకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదంటూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు ఈ అన్యాయంపై అభ్యర్థులు, నిరుద్యోగులు కోర్టులను ఆశ్రయిస్తుంటే, "కోర్టులకు వెళ్తే ఊరుకోం" అంటూ ప్రభుత్వం బెదిరింపులకు దిగడం దుర్మార్గమ్మార్కెట్‌లో 15 లక్షలు ఇస్తే ఉద్యోగం ఇస్తామనే ఆడియోలు బయటకు వచ్చాయి. ఆ ఆడియోలపై కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అందులో మాట్లాడిన వారిని ఎందుకు పోలీస్ స్టేషన్‌లో పెట్టలేదు?"ఇందులో భాగంగా ఈరోజు వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టాం, సోమవారం నాడు యువత ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తాం కూటమి ప్రభుత్వం డీఎస్సీ 2025 నిర్వహణలో అవకతవకలపై వెంటనే సిబిఐ విచారణ జరిపించి, వాస్తవాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నాం.

# కావలి ఆర్టీసి బస్టాండులో పారిశుద్ధ్యం ప్రయాణీకుల సౌకర్యాలపై సమీక్ష ఆర్టీసి ప్రాంగణాన్ని పరిశీలించిన కావలి ఎమ్మెల్యే, ఆర్టీసి జోనల్ చైర్మెన్





**కావలి, మే 29 ప్రభాతవార్త :** కావలి ఆర్టీసి బస్టాండులో ప్రయాణీకులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి వసతి టాయిలెట్లు, డిపోలో అమ్ముతున్న వస్తువుల నాణ్యత తదితర అంశాలపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, నెల్లూరు ఆర్టీసి జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిలు శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా వారు డిపో ప్రాంగణాన్ని పరిశీలించి ప్రయాణీకులకు అందుతున్న సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్టీసి డిపో ప్రజలకు ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ఈ డిపో ద్వారా ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణీకులు సేవలు పొందుతున్నారని తెలిపారు. మహిళా శక్తి పథకం అమలులోకి వచ్చిన తరువాత మహిళల ప్రయాణీకులు గణనీయంగా పెరిగాయని ఇప్పటి వరకు సుమారు 65లక్షల మంది ప్రయాణీకులు ఈ డిపో దావరా రాకపోకలు సాగించారని వెల్లడించారు. ఈ సేవల ద్వారా ఆర్టీసికి రూ.27కోట్లుకు పైగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రోటరీక్లబ్ సహకారంతో రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత ఆర్ఓ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణీకులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం అభినందనీయమన్నారు. జూన్ 12నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకువస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు అవసరైమన పాఠ్యపుస్తకాలు, మౌళిక సదుపాయాలతో పాటు ఉచిత బస్సు పాసులు అందిస్తూ ఆర్టీసి సేవలను విద్యార్థులకు చేరువ చేస్తున్నటుల తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో డ్రైవరుల, కండక్టర్లు, అధికారులు అంకితభావంతో పనిచేయడం అభినందనీయమన్నారు. డిపోలో శానిటేషన్ సమస్యలు తాగునీటి వంటి సమస్యలు, టాయిలెట్లు నిర్వహణ, వంటి అంశాలపై కూడా ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిపారు. మున్సిపల్ అధికారులు సమన్వయంతో డిపో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. డిపోలో ఎటువంటి అసాంఘీక కార్యలాపాలు చోటు చేసుకోకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రయాణీకులకు భద్రత కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల సూచనలు, ప్రయాణీకుల అభిప్రాయాలను ప్రభుత్వం దృషిటకి తీసుకెళ్లి కావలి ఆర్టీసి డిపో అభివృద్ధికి అవసరమైన బస్సులు, సిబ్బంది ఇతర సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నెల్లూరు ఆర్టీసి జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేసూచనల మేరకు డిపోలో ప్రయాణీకులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాత టాయిలెట్లు స్థానంలో కొత్త సదుపాయాలు ఏర్పాటు చేయడం డిపోలో పరిశుభ్రత, పెయింటింగ్ తదితర అంశాలపై అధికారులు చర్యలు చేపడుతారని చెప్పారు. ఎమ్మెల్యే సూచించిన అన్ని అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అమలు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రావన్‌కుమార్, ఆర్టీసి డిపో మేనేజర్ డి.ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజర్ కల్పన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటు మన హక్కు కాపాడుకునే బాధ్యత మనదే



మేకపాటి రాజగోపాల్ రెడ్డి

**వింజమూరు, మే 29, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య దేశాలలో ఓటు అనేది ప్రధాన బాధ్యతగా ఉంటుందని ఓటు లేని వాడు వయోజనునిగా వృధా అవుతాడనీ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరులోని విఆర్ ఫంక్షన్ ప్లాజా లో మండల వైసీపీ కన్వీనర్ రేవనూరు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎస్ఐఆర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా బిఎల్వోలు ఇతర నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటును సక్రమంగా పొంది నాయకులను ఎన్నుకోవాల్సి ఉందని కానీ ప్రస్తుతం ఓట్లను తొలగించి అధికారాన్ని చేపట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్నాయన్నారు. జూన్ నెల 15 నుండి జూలై నెల 15 వరకు జాబితా పరిశీలన ఉంటుందని ఆ పరిశీలనలో తమ ఓటు ఉందో లేదో సమగ్రంగా పరిశీలించుకుని లేనియెడల తిరిగి సరైన పత్రాలను పూర్తి చేసి పాస్పోర్ట్ సైజ్ ఫోటోను అంటించి బూత్ కన్వీనర్లకు అందజేయాలని అప్పుడే మన ఓటు దక్కుతుందన్నారు గ్రామంలో చనిపోయిన వారి పేర్లు గ్రామంలో నివాసం లేని వారి పేర్లను సాధారణంగా ఓటర్ల జాబితా నుండి తొలగిస్తారని కానీ ప్రస్తుతం అధికారం దాహం కోసం ఉన్నటువంటి వ్యక్తుల ఓట్లను తొలగించడం జరుగుతుందని తెలిపారు అలాంటి విషయంలో నాయకులు జాగ్రత్తలు వహించి బిఎల్ఎల ద్వారా పరిశీలింపచేసి ప్రతి ఒక్కరి ఓటును నిలిపే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు ఓట్లు తొలగించినట్లయితే మన పార్టీ నష్టపోయే అవకాశం ఉంటుందని కావున మనం ఎంతో జాగ్రత్తగా మన ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మేకపాటి అభినవరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కూనం సుధాకర్ రెడ్డి, జిల్లా బూత్ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు కన్వీనర్ రేవనూరు శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి, అంకినపల్లి నరసింహారెడ్డి, మద్దూరి లక్ష్మిప్రసాద్ రెడ్డి, పల్లాల ప్రసాద్ రెడ్డి బయ్యపు రెడ్డి, విజయ కృష్ణారెడ్డి నీలం సంజీవరెడ్డి, 8 మండలాల కన్వీనర్లు, జడ్పిటిసి సభ్యులు, ఎంపీటీసీలు, బూతు కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# కావలి... ప్రతి ఇంటికి మెగా ఆధ్వర్యంలోతాగు నీటి కుళాయి కనెక్షన్లు

పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష



**నెల్లూరు కార్పోరేషన్, మే 29 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మెగా వర్క్స్ ఇంజనీర్లు, పబ్లిక్ హెల్త్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలకసంస్థ పరిధిలోని ప్రతి ఇంటికి మెగా వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో తాగునీటి కుళాయి కనెక్షన్లును తప్పనిసరిగా అందించాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి లీకేజీలు అంతరాయాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించి సురక్షిత తాగునీటిని ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతుజానీ, ఈఈలు శేషగిరిరావు, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 31న శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి

16 రోజుల పండగ, ప్రత్యేకంగా కళ్యాణ మహోత్సవం



**బుచ్చి మే 29 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో ఈనెల 31 వతేది 16 రోజుల పండుగ దేవాల సంప్రదాయాలతో నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బ్రహ్మోత్స వాలు, స్వామి వారి కళ్యాణోత్స వం ముగిసిన తరువాత 16 రోజుల పండుగ నిర్వహించడం ఒక ప్రాచీన ఆచారం అని వారు వివరించారు. 16 రోజుల పండుగ సందర్భంగా ఉదయం 10 గంటలకు కళ్యాణోత్స వం, ప్రత్యేక పూలంగిసేవ, అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. రాత్రి 7 గంటలకు నృత్యప్రదర్శన, రాత్రి 7.30 నిమిషాలకు పల్లకీసేవ, రాత్రి 8 గంటలకు వీణా కచ్చేరి, రాత్రి 9 గంటలకు ఏకాంతసేవ కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి ప్రత్యేక పూజలు, అలంకారాలు, సంగీత - సాంస్కృతిక కార్యక్రమాల్లోని పాల్గోని తీర్ధ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

# పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి చేతికి




- 570 మొబైళ్లను బాధితులకు అందజేసిన పోలీసులు

**నెల్లూరు క్రైం, మే 29, ప్రభాతవార్త** జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో పనిచేస్తోందని జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన రూ. 1 కోటి 14 లక్షల విలువ గల 570 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటివరకు తొమ్మిది విడతలలో మొత్తం 5010 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఈఐఆర్ పోర్టల్ ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తూ సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. ❖ జిల్లా సైబర్ క్రైమ్ బృందం, స్థానిక పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న మొబైల్ ఫోన్లను కూడా ట్రేస్ చేసి బాధితులకు తిరిగి అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యక్తి జీవితంలో మొబైల్ ఫోన్ కీలక సాధనంగా మారిందని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ సేవలు, విద్య, ఉద్యోగాలు, వ్యాపార కార్యకలాపాలు అన్నీ మొబైల్ ఫోన్ ద్వారానే జరుగుతున్నాయని చెప్పారు. ఫోన్ పోగొట్టుకున్నప్పుడు ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతారని, అలాంటి ప్రతి బాధితుడికి అండగా నిలవడమే పోలీస్ శాఖ లక్ష్యమన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఐఎంఈఐ నంబర్, మొబైల్ కొనుగోలు బిల్ లేదా బాక్స్, గుర్తింపు కార్డు, కంప్లైంట్ కాపీ, ఓటిపి కోసం కొత్త మొబైల్ నంబర్ వంటి వివరాలతో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రాంతాల్లో తక్కువ ధరలకు మొబైల్ ఫోన్లు అమ్మే వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బిల్లులు లేకుండా విక్రయించే మొబైల్ ఫోన్లను కొనుగోలు చేయవద్దని, సెల్‌ఫోన్ దుకాణాల నిర్వాహకులు సరైన ఆధారాలు లేకుండా సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేయరాదని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మొబైల్ విక్రయాలపై సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100/112కు సమాచారం అందించాలని కోరారు. పోగొట్టుకున్న సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించడంలో ప్రతిభ కనబరిచిన అన్ని ఎస్‌హెచ్‌ఓ, సైబర్ విభాగం సీఐ యం. పూర్ణ చంద్రరావు, డిసిఆర్బి సీఐ రామారావు తదితర సైబర్, సోషల్ మీడియా బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం కలిగిన పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందం నిరంతరం పనిచేస్తోందన్నారు. తమ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు జిల్లా పోలీస్ శాఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కలిచేటి కృష్ణయ్య



**చిల్లకూరు, మే 29, ప్రభాతవార్త :** మండలంలోని బూదనం అరుంధతీవాడకు చెందిన కలిచేటి కృష్ణయ్య అనే వ్యక్తి రోజు వారి కూలి పని ముగించుకుని తిరిగి ఇంటికి వసున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆ నిరుపేద కుటుంబానికి దహన సంస్కారాలు నిమిత్తం బూదనం ఆయకట్ట ప్రెసిడెంట్ సూరానేని రామచంద్ర రావు వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు.

## పొగాకు మానితేనే ఆరోగ్యకర జీవితం



**తోటపల్లి గూడూరు, మే 29, ప్రభాతవార్త:** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తోటపల్లి గూడూరు మండలంలోని మల్లికార్జునపురం, మాచర్ల వారిపాలెం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల్లో పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై చైతన్యం కల్పిస్తూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. గ్రామస్థులకు పొగాకు వల్ల గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రా ణాంతక సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ పొగాకు మానేయడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చని తెలిపారు.

## ప్రభుత్వ బడుల వైపు అడుగులు



**తోటపల్లి గూడూరు, మే 29, ప్రభాతవార్త :** మండలంలోని సౌత్ ఆములూరు గ్రామంలో శుక్రవారం బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ఉత్సా హంగా నిర్వహించారు. విద్యార్థుల నమోదు డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి2 డి. జయరామ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ బడుల్లో ఉన్న మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సేవలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు. సౌత్ ఆములూరు మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. వర ప్రసాదరావు, ఉపాధ్యయులు అహ్మద్ భాష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామంలో పర్యటించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులతో కలిసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరజీవి జక్కా వెంకయ్య ఆశయాలు యువతకు ఆదర్శం



**తోటపల్లి గూడూరు, మే 29, ప్రభాతవార్త :** అమరజీవి కామ్రేడ్ జక్కా వెంకయ్య 8వ వర్ధంతి సందర్భంగా నరుకూరు సెంటర్, పేడూరు, టీపీ గూడూరు ఇస్కపాలెం గ్రామాల్లో ఘనంగా నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా, సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, మండల కమిటీ సభ్యుడు బండి శౌరి పాల్గొని మాట్లాడారు. జక్కా వెంకయ్య దామరమడుగు గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని 70 ఏళ్లకు పైగా స్వచ్ఛమైన విప్లవ నాయకుడిగా ప్రజల కోసం పోరాటాలు సాగించారని తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, వ్యవసాయ కూలీలపై జరుగుతున్న దోపిడీలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని పేర్కొన్నారు. నీటి పారుదల, రైతాంగ సమస్యలు, చెరువుల పరిరక్షణ అంశాల్లో ఆయనకు అపార అనుభవం ఉందని, సోమశిల ప్రాజెక్టు సాగునీటి సమస్యల పరిష్కారంలో కీలక సూచనలు చేశారని గుర్తు చేశారు. 1979 తుఫాను సమయంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాడటంతో పాటు మతసామరస్య పరిరక్షణ కోసం ఉదయగిరి నుంచి నెల్లూరు వరకు నిర్వహించిన పాదయాత్రలో ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి తాగునీరు, రోడ్లు, కాలువలు, విద్యుత్ సౌకర్యాల కల్పనలో విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజా ఉద్యమాల కోసం పలుమార్లు జైలు జీవితం గడిపిన ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సీపీఎం పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాజయ్య, కొండయ్య, ఆరని గోపి, శివ, వెంకట శేషయ్య, దయాకర్, ఆకుల రఘు, అజ్మా తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపాడు ఎస్ఐ బలరాంరెడ్డిని కలిసిన జనసేన నాయకులు



**మర్రిపాడు,మే29,ప్రభాతవార్త:** మర్రిపాడు పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన జె.బలరాంరెడ్డిని మండల జనసేన పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిర క్షణలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు కోరారు.నియోజకవర్గ జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు దబ్బుకొట్టు నాగరాజుయాదవ్, మండల నాయకులు, మండలప్రధాన కార్యదర్శి సునీల్‌యాదవ్, మధుసూధన్‌రావు, గాలిబోయినపోలయ్య యాదవ్, కిషోర్‌రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తహసిల్దార్, ఎంఇఒ-1ను కలిసిన వైఎస్ఆర్ టిఎ



**అనంతసాగరం,మే29,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరం తహసిల్దార్ వీర వసంత రావు, నూతన మండల విద్యాధికారి-1 నారాయణను శుక్రవారం వైఎస్ఆర్‌సిపి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌టిఎ ఉపాధ్యాయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యాల డేనియల్, వైఎస్ఆర్ టిఎ మండల అధ్యక్షుడు ఆదిశేషయ్య, వైసిపి నాయకులు బట్రెడ్డి నాగేంద్ర లు కలిశారు. ఈసందర్భంగా వారిని శాలువాలతో సన్మానించి వైఎస్ఆర్ టిఎ డైరీని అందజేశారు.

## విద్యుత్ అంతరాయం

**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త వైద్యం :** 33/11 కెవి సి.జి.రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా మూడవ మైల్, డిఎస్ నగర్, ప్రశాంతి నగర్, రాజీవ్ గాంధీ కాలనీ, కిసాన్ నగర్, వెంగల్ రెడ్డి నగర్, సింహపురి కాలనీ, జాకీర్ హుస్సేన్ నగర్, లక్ష్మీ పురం, వీవర్స్ కాలనీ, బంగ్లా తోట పరిసర ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల జరుగును.వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని,అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలియచేస్తున్నాము.

## ఐడాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియో సేవలు అభినందనీయం

## నంది మండలం భానుశ్రీ,మాజీ నగర మేయర్



**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త వైద్యం :** తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం, వేదాయ పాలెం, వెంకటరెడ్డి నగర్ లోని ఐ డాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియో ప్రాంగణంలో ఐ డాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియో ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించబడింది. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ స్వచ్ఛందంగా రక్తదానం చేసి, ఐ డాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియో వారి సేవలు అమూల్యమైనవని అన్నారు. కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం తనకు చాలా ఆనందంగా ఉందని ఆమె అన్నారు. ఒకరి రక్తదానంతో ముగ్గురు ప్రాణాలను కాపాడగలదని ఆమె చెప్పారు. రక్తం మార్కెట్లో లభించే సరుకుకాదని. లక్షల రూపాయలు ఖర్చుపెట్టినా రక్తాన్ని ఉత్పత్తి చేయలేరని, అందువల్ల యువతీ, యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో జిల్లా పీఎంపీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, కె.రామరాఘవయ్య, బి.సురేష్, బి.ప్రశాంతి, అంకమ్మ తల్లి ఆటో ఫైనాన్స్ అధినేత కుంచెం కోటి, శ్రీహరి, బాలరాజు, కిరిటి, గోకుల్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

## సోమశిలలో కిశోరి వికాసం

**అనంతసాగరం,మే29,ప్రభాతవార్త:** అనంతసాగరం మండలంలోని సోమశిల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరివికాసం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శారద హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరి బాలికలు ఈ కిశోరి వికాసంలో అనేక విషయాల గురించి తెలుసుకున్నారని అదే విధంగా విద్య ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలన్నారు. విద్యను ఎవరూ అశ్రద్ధ చేయరాదన్నారు. విద్యతో భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాలను సాధించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, బాల బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గిరిజనులకు హక్కులపై అవగాహన



**కొడవలూరు,మే 29 ప్రభాతవార్త :** ప్రతి గిరిజనుడు తమ రాజ్యాంగబద్ధ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్త్ రాజుపాలెం వినాయక కాలనీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాటాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన ప్రత్యేక హక్కులు, రక్షణలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గిరిజనుల భూమి హక్కులు, సామాజిక రక్షణ, ప్రాథమిక హక్కులపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, రిజర్వేషన్ల ప్రాధాన్యతను వివరించారు.ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని, అక్షరాస్యతతోనే సమాజంలో గౌరవం పెరుగుతుందని తెలిపారు. తమ హక్కులను తెలుసుకోవడం ద్వారా సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కరకటి మల్లికార్జున్, గ్రామ రెవెన్యూ అధికారి మల్లికార్జున్, గిరిజనులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువులతో భూసారం తగ్గుతోంది ఏడీఏ అనిత



**కొడవలూరు, మే 29, ప్రభాతవార్త :** రసాయన ఎరువుల అధిక వినియోగంతో భూమి సారం దెబ్బతింటోందని, రైతులు భూసారాన్ని పెంపొందించుకునే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిత సూచించారు. రామన్నపాలెం, నార్త్ రాజుపాలెం గ్రామాల్లో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రస్తుత వ్యవసాయ విధానాల్లో రసాయనాల వినియోగం పెరగడంతో భూములు నిస్సారంగా మారుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. భూసారాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక కిట్లను రైతులు వినియోగించుకోవాలని సూచించారు.అదేవిధంగా ప్రభుత్వం ఎంపిక చేసిన విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తోందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మెరుగైన దిగుబడులు సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి విజయలక్ష్మి, వ్యవసాయ సహాయకులు నిహారిక, శివజ్యోతి పాల్గొన్నారు.

## హైబ్రిడ్ మహానాడు విజయవంతం



**కోవూరు, మే29ప్రభాతవార్త :** భౌగోళిక అనుచితులు కారణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా మహానాడు నిర్వహించాలని నిర్ణయించారని, కోవూరు మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంచేసిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులకు, కార్యకర్తలకు ,అభిమానులకు , నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపు తున్నామని మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలంలో టీడీపీ కార్యాలయంలోనూ, లేగుంటపాడు పీఎస్ఆర్ కళ్యాణ మండపంలోనూ జరిగిన ఈ మహానాడు కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం కావడం, నేతల్లో, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఇదేస్ఫూర్తిని కొనసాగిస్తూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సారథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్‌ను ప్రకటించి మహిళలకు అగ్రభాగాన నిలపాలన్నదే పార్టీ ముఖ్య ఉద్దేశమన్నారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు, కష్టపడ్డ వారికి గుర్తింపు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్ నాయకులను సన్మానించుకోవడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## రైతులపై కూటమి ప్రభుత్వం అధిక భారం మోపడం సమంజసం కాదు



**కోవూరు, మే29ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వంలో డీజిల్, పెట్రోల్ ధరలు అత్యధికంగా పెంచి రైతులపై అధిక భారం మోపడం సమంజసం కాదని వైసీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరులోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం రైతు సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీజిల్, పెట్రోల్ ధరలు పెంచడమే కాకుండా వ్యవసాయానికి సంబంధించి పిండి కట్టలు, పురుగుమందులు కూడా తమ ఇష్టానుసారంగా పెంచి రైతులపై అధిక భారం మోపుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పెట్రోల్ , డీజిల్ ధరలు ఒక్కసారి పెంచారని, ధర్నాలు , రాస్తారోకోలు చేసిన నేతలు ఈ కూటమి ప్రభుత్వంలో అత్యధికంగా డీజిల్, పెట్రోల్ పెంచి ప్రజలపై, రైతాంగంపై అధికభారం మోపడం సమంజసమేనా అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి పెంచిన పెట్రోల్ ,డీజిల్ ధరలను తగ్గించాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెరుగుతున్న ధరల దృష్ట్యా వ్యవసాయ రంగం పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. వైసీపీ సీనియర్ నేత జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మాట్లడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తున్నా ప్రజలకు ఏమి ఒరగబెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్‌తో పాటు వ్యవసాయ అనుబంధ వస్తువులపై ధరలు ఇష్టానుసారంగా పెరిగిపోయాయయన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి అన్నదాతను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కర్ణాటకలో ఎంతుంది.. తమిళనాడులో ఎంతుంది.. నేను వస్తే ఇంత తగ్గిస్తానని చెప్పిన కూటమి నేతలు ఏకంగా 8 రూపాయలు పెట్రోల్ ధరలు పెంచితే రైతుల పరిస్థితి ఏమిటన్నారు. పెంచిన ధరల దృష్ట్యా ట్రాన్స్‌పోర్ట్ రంగంపై పెద్ద భారం పడిందన్నారు. ఈ కారణంగా మధ్యతరగతి కుటుంబాలు పూర్తిగా ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ప్రస్తుతం గ్యాస్ ధరలు కూడా పెంచి మధ్యతరగతి కుటుంబాలను పూర్తిగా ఇబ్బందుల పాలు చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించకపోతే ప్రజలే మీకు బుద్ధి చెప్పే రోజు దగ్గరలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మావులూరు శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి, వైసీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి మహేష్, యాక్టివ్ కార్యదర్శి నలుబోలు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు శ్రీలత్తి హరిప్రసాద్‌రెడ్డి, కవరగిరి ప్రసాద్; తదితరులు ఉన్నారు.

## జనగణనకు రెండు రోజులే గడువు



**కోవూరు, మే29ప్రభాతవార్త :** కోవూరు మండలంలో జనగణన కార్యక్రమం నూరుశాతం పూర్తయ్యేందుకు కేవలం రెండు రోజుల మాత్రమే అవకాశం ఉందని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో జనగణన కార్యక్రమంపై ఎన్యుమరేటర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. మండలంలో 538 డోర్‌లాక్ గృహాలు ఉన్నాయని, వారంతా ఉన్న ఈ రెండు రోజుల పాటు ఎన్యుమరేటర్లకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గ్రామంలో ఎక్కువగా డోర్ లాక్ ఉన్నాయని, వారందరూ ఈ నెల 31వ తేది లోగా వచ్చి జనగణన కార్యక్రమానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో రామ్మోహన్, ఎన్యుమరేటర్లు ఉన్నారు.

## గూడ్స్ రైలు ఢీ.. గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కోవూరు, మే29ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు రైల్వే స్టేషన్ పరిధిలో 178/30 కిలోమీటర్ వద్ద రైలు పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని బిట్రగుంట నుంచి రేణిగుంటకు వెళ్లే గూడ్స్ రైలు ఢీకొంది. ఈ సంఘటనలో సుమారు 45 నుంచి 50 సంవత్సరాలు వయస్సు గల పురుషుడు తీవ్రగాయలపాలై 108 ద్వారా నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ వ్యక్తి యొక్క ఆచూకీ తెలిసిన వారు కావలి రైల్వే పోలీసులను 9247575630 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## గురుకుల కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల కౌన్సిలింగ్ నిర్వహణ



**తోటపల్లి గూడూరు, మే 29, ప్రభాతవార్త :** తోటపల్లి గూడూరు మండలం కోడూరులోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. కోడూరు, ముత్తుకూరు, సంగం, బుచ్చి, కందలేరు ప్రాంతాలకు చెందిన కళాశాలల ప్రవేశాల ప్రక్రియకు సంబంధించిన ఈ కౌన్సిలింగ్‌లో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ మాట్లాడుతూ సంబంధిత కళాశాలకు మొత్తం 74 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థినులు విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీవో భారతి, ఆదూరుపల్లి కళాశాల ప్రిన్సిపాల్ పద్మజతో పాటు బాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గుమ్మలదిబ్బ కాలనీలో పోలీసుల కార్డెన్ సెర్చ్





**కోవూరు, మే 29 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతోశుక్రవారం కోవూరు మండలం కోవూరు పంచాయతీగుమ్మలదిబ్బ కాలనీలో కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్‌లో శాంతి భద్రతలతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఈ కార్యక్రమాల వలన ఎక్కడైనా గంజాయి ఇతర నిషేధిత పదార్థాలు ఉంటే వాటిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రామస్తులు తమ మైనర్ చిన్నారులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వలన అనేక ఇబ్బందులు తలెత్తే పరిస్థితి వస్తుం దన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలు అక్రమ ఆన్‌లైన్ కార్యక్రమాలకు దూరంగా ఉండడం మేలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా కొత్త వ్యక్తులు తిరుగుతుంటే వెంటనే అటువంటి సమాచారాన్ని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిపై నిఘా పెట్టి వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందని, ఇందుకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. తమ ఆడబిడ్డలకు కూడా పలు విషయాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రజలందరూ నేర నియంత్రణకు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా రహదారిలో ప్రయాణించే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం మద్య సేవించడం, గంజాయి కారణమని గుర్తించడం జరిగిందన్నారుముఖ్యంగా దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ బిడ్డల కదలికలపై దృష్టి సారిస్తే ప్రమాదాలు, నేరాల నియంత్రణ తగ్గేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎటువంటి పత్రాలు లేకున్న ఉన్న 23 బైక్‌లను, 4 ఆటోలను సీజ్ చేశారు. వీటికి సరైన పత్రాలు ఉంటే వాటిని సంబంధిత యాజమానికి అందజేయడం జరుగుతుందన్నారు.ఎస్సై ముత్యాలరావు,, ఏఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు,పోలీసులు ఉన్నారు.

## ఎన్డిపిఎస్ షీట్లపై కఠిన నిఘా

**- స్మార్ట్ పోలీసింగ్‌పై ఎస్పీ అజిత వెజెండ్ల దిశానిర్దేశం**



**నెల్లూరు క్రైం, మే 29, ప్రభాతవార్త :** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ, సెక్సువల్ అఫెండర్ల పర్య వేక్షణ, స్మార్ట్ పోలీసింగ్ అమలుపై జిల్లా పోలీస్ శాఖ మరింత దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆధ్వ ర్యంలో జిల్లాలోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా ఎన్డిపిఎస్ షీట్ మానిటరింగ్, సెక్సువల్ అఫెండర్ షీట్ పర్యవేక్షణ, స్మార్ట్ పోలీసింగ్ అంశా లపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఎన్డిపిఎస్ కేసులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, షీటర్ల కదలికలు, పాత కేసుల స్థితి, బెయిల్‌పై విడుదలైన నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల సరఫరా, రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ఇంటెలిజెన్స్ ఆధారిత చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్న ఎస్పీ, సెక్సువల్ అఫెండర్ల కదలికలు, ప్రవర్తనపై నిరంతర నిఘా కొనసాగిస్తూ అవసరమైన చోట కౌన్సెలింగ్‌తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలపై జరిగే నేరాల నివారణలో ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. స్మార్ట్ పోలీసింగ్ వ్యవస్థల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఎస్పీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చాలని సూచించారు. మిస్సింగ్ కేసులు, ప్రాపర్టీ అఫెన్సులు, వాహనాల అన్వేషణ, నేరస్తుల గుర్తింపులో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ వారీగా కేపీఐ ఆధారంగా ఎస్ హెచ్ ఓల పనితీరును సమీక్షిస్తూ కేసుల దర్యాప్తు, స్పందన సమయం, నేర నియంత్రణ,ప్రజా సేవల అమలులో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.అలాగే పీపీపీ విధానంలో ప్రజలు, ప్రైవేట్ సంస్థలు, పోలీస్ శాఖ పరస్పర సహ కారంతో సీసీటీవీ వ్యవస్థల విస్తరణ, సాంకేతిక మౌలిక వసతుల అభివృద్ధి, భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సిహెచ్ సౌజన్యతో పాటు జిల్లాలోని వివిధ సబ్ డివిజన్ల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ జక్కా వెంకయ్య



**బుచ్చి మే 29 ప్రభాతవార్త :** పేద,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ జక్కా వెంకయ్య అని సిపిఎం పార్టీ నాయకులు కొనియాడారు. దివంగత కామ్రేడ్ జక్కా వెంకయ్య 8 వ వర్థంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం పార్టీ కార్యాలయంలో, పెనుబల్లి గ్రామంలో,దామరమడుగు గ్రామంలో ,బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్‌లో మండలంలో పలు చోట్ల ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జొన్నలగడ్డ వెంకమ రాజు, ముత్యాల గురునాథం, పోతంశెట్టి శ్రీనివాసులు, చల్లకొలుసు మల్లికార్జున,షేక్ జానీబాషా,జొన్నవాడ రమణ య్య,పగడాల సుబ్రహ్మణ్యం, సిపిఎం, సిఐటియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో కామ్రేడ్ జక్కా వెంకయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్పాహారం ఏర్పాటు చేశారు. మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు ఆయన భూస్వామి కుటుంబలో పుట్టినా పేదల పక్షపాతిగానే జీవించారని కొనియాడారు. వ్యవసాయ,ఇరిగేషన్ రంగంపై ఆయనకు అపారమైన అనుభవం ఉందని అన్నారు. జిల్లాలో కమ్యునిష్టు ఉద్యమానికి ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు,సిఐటియు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సీతారామపురం బెస్తకాలనీలో కార్డున్ సర్చె



**సీతారామపురం మే 29 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పి అజిత వెజండ్ల ,కావలి డిఎస్పి వెంకట రమణ ఆదేశాల మేరకుసీ తారామపురంలోని బెస్తకాలనీలో ఉదయగిరి సిఐ వెంకట్రావ్ ఆధ్వర్యంలో సుమారు 40 మంది పోలీసులు బృందం శుక్రవారం కాటన్ సర్చి నిర్వహి ంచారు. బెస్తకాలనీలో ప్రతి ఇంటిని సోదా చేసి సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం సిఐ వెంకట్రావ్ విలేకర్లతో మాట్లాడుతు సీతారామపురం బెస్తకాలనీలోకి ఇతర ప్రాంతాల నుండి కొత్త వ్యక్తులు వస్తు వెళుతున్నారని అంతే కాకుండా బెస్తకాలనీలోని కొందరు యువకులు గంజాయికి అలవాటు పడుతున్నారని సమాచారం రావడంతో ఎస్పి ఆదేశాల ప్రకారం కాలనీలోని సుమారు 120 నివాసాలలో సోదాలు నిర్వహించి అనుమానితుల వివరాలు సేకరించామని సరైన పత్రాలు లేని 20 ద్విచక్రవాహనాలను,నాలుగు చక్రాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.వాహనదారులు సరైన పత్రాలను చూపిస్తే వాహనాలను అప్పగిస్తామన్నారు. జాతీయ రహదారులపై లేదా ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే 112కిగాని పోలీస్‌స్టేషన్‌కుగాని సమాచారం అందించి బాధితుల ప్రాణాలను కాపాడడంలో ప్రజలు ముందుకు రావాలని పిలుపు నిచ్చా రు. గంజాయి నిర్మూలన,రోడ్డు ప్రమాదాల నివారణ,నిర్భయ చట్టంపై గ్రామ పెద్దల సమక్షంలో యువతకు మహిళలకు అవగాహన కల్పించామన్నారు.ఈకార్యక్రమంలో సీతారామపురం,ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు,ఎస్ఐలు వెంకటరాజేష్,మహేంద్ర,శ్రీనివాసులు,ఆదిలక్ష్మీ,మదుసూదన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతతోనే భద్రమైన భవిష్యత్

**- బుచ్చిరెడ్డిపాలెం వెలుగు కార్యాలయంలో ఆర్బీఐ అవగాహన సదస్సు**



**బుచ్చిరెడ్డిపాలెం, మే 29, ప్రభాతవార్త :** ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడం, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీఎం శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం బుచ్చిరెడ్డిపాలెంలోని వెలుగు కార్యాలయంలో భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ) ఆధ్వర్యంలో డిపాజిటర్ల విద్య, అవగాహన (డీఈఏ) కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల్లో పొదుపు చేయడం, డిజిటల్ లావాదేవీల్లో జాగ్రత్తలు పాటించడం, మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు పొదుపు అలవాటు ఎంతో అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీబీ) ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్ కోఆర్డినేటర్ గురుస్వామి, ఆర్బీఐ విజయవాడ పరిశీలకుడు మిథున్, ఏపీఎం బి. శ్రీధర్, ఆర్‌పీ వెంకటేశ్వర్లు, ఏ. చంద్రశేఖర్ తదితరులు పాల్గొని మహిళలకు ఆర్థిక నిర్వహణ, బ్యాంకింగ్ సేవల వినియోగంపై సూచనలు చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. ప్రజల్లో ఆర్థిక చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

## ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌ను మందలించిన కార్పోరేషన్ అధికారులు

**నెల్లూరు కార్పోరేషన్, మే 29 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.నందన్ పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా సాతనిక జీఎస్‌టి రోడ్డు ప్రభుత్వ మెడికల్ కళాశాల సమీపంలో నిర్దేశించిన ప్రమాణాలను పాటించకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి వాహనాన్ని ఆపి డ్రైవర్‌ను మందలించారు. రవాణా సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. పూర్తిస్థాయిలో పట్టను కప్పి రవాణా చేయాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. పట్టను పూర్తిగా వాహనంపై కప్పుకున్నాకే వాహనాన్ని పంపించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం డిఈ రఘురాం, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించిన జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ

**సీతారామపురం మే 29 ప్రభాతవార్త :** సీతారామపురం మండలకేంద్రంలో నివాసం ఉంటున్న తిరుమలాపురం వెంకటేశ్వర్లు కుటుంబాన్ని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిది రాయపాటి అరుణ పరామర్శించారు. ఇటీవల తిరుమలాపురం వెంకటేశ్వర్లు తండ్రి మరణించిన విషయం తెలుసుకొని ఆయనను పరామర్శించేందుకు వచ్చారు.ఆమెకు సీతారామపురంలో జనసేన నసేవకోసం నావంతు రాష్ట్ర కో ఆర్డినేటర్ ఉదయగిరి నియోజకవర్గ జనసేన నాయకుడు బోగినేని కాశీరావు మండల జనసేన నాయకుడు బోగినేని కాశీరత్తయ్యలు స్వాగతం పలికారు.అనంతరం జనసైనికులను పేరుపేరున ఆప్యాయంగా ఆమె పలకరించారు.ఈకార్యక్రమంలోజనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కావలిలో క్లీన్‌స్వీప్ కార్యక్రమం

**కావలి, మే 29 ప్రభాతవార్త :** ఈనెల 22నుండి జూన్ 20వరకు 36రోజులు స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో బాగంగా కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావన్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక 5వ వార్డులో పంటకాలువల, అక్కమ్మబావి వద్ద, 23వ వార్డులోని వెంగళరావు నగర్‌లోని 100అడుగుల రోడ్లు, 28వ వార్డులోని ఉదయగిరి ఫ్లైఓవర్ బ్రిడ్జికింద మాజీ మంత్రి స్వర్గీయ కలికి యానాదిరెడ్డి ఇంటి పక్కన ఉన్న వీధి, 38వ వార్డు వైకుంఠపురం రోడ్డు, డ్రైవల్‌ల వద్ద క్లీన్‌స్వీప్ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. అనంతరం రోడ్డును పరిసర ప్రాంతాలను శుభ్రపరచడం జరిగింది. ఈకార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది వార్డు ప్రజలు, ఎస్‌హెచ్‌జి గ్రూపు, సభ్యులు, స్వచ్ఛంద వాలంటీర్లు పాల్గొ నడం జరిగింది.



## ఘనంగా కామ్రేడ్ జక్కా వెంకన్న వర్ధంతి

**కావలి, మే 29 ప్రభాతవార్త :** సిపిఎం పట్టణ కమిటి ఆధవర్యంలో అమరజీవి కామ్రేడ్ జక్కా వెంకన్న 8వ వర్ధంతి శుక్రవారం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. వెంటన్న చిత్రపటానికి రిటైర్డు ఎంఈఓ కలయ్య, ఏ.రమణయ్యలు పూలమాలలు వేసి ఘనంగా జోహర్లు అర్పించడం జరిగింది. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ జక్కా వెంకన్న లేనిలోటు ప్రజా ఉద్యమాలకు తీరని లోటని తెలిపారు. జిల్లా మార్కిస్టుపార్టీ నిర్మాత అని పార్టీ కార్యకర్తలను వెన్నుతట్టి ప్రజా పోరాటాల వైపు నడిపించారని తెలిపారు. కార్మిక సమస్యలపై పోరాటాలు చేసి కార్మికులకు అండగా నిలివారని తెలిపారు. పేదల గుండెల్లో కమ్యూనిస్టుగా చిరస్థాయిగా నిలిచారని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్ళేందుకు రావాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.వెంకయ్య, టి.సుబ్బరామశర్మ, టి.మాల్యాద్రి, ప్రజా సంఘాల నాయకులు జి.మధుసూదన్‌రావు, బి.క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

..చిత్తలూరు ఎస్సీ కాలనీలో కిశోర వికాసం

**చేజర్ల,మే29ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని చిత్తలూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం వేసవి సెలవుల సందర్భంగా కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికలు, బాలురకు విద్య ప్రాముఖ్యతతో పాటు భవిష్యతున్ను తీర్చిదిద్దుకునే నైపుణ్యాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాల లేద కళాశాల చదువును మధ్యలో మానివేయకుండా పూర్తి స్థాయిలో కొనసాగించాలని సూచించారు. ఉన్నత విద్యతోనే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలంటే కష్టపడి చదవాల్సిన అవసరం వుందని వివరించారు. అలాగే సెల్‌ఫోన్ వినియోగంపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్ ఫోన్లలో మంచి,చెడు రెండు వుంటాయిని అందులో మంచిని మాత్రమే స్వీకరించాలని తెలిపారు. అవసరానికి మించి ఫోన్ల వినియోగం విద్యపై ప్రభావం చూపుతుందని, అవసరమైనప్పుడు మాత్రమే మొబైల్ ఫోన్లను ఉపయోగించాలని సూచించారు. బాల్యవివాహలు నివారణా చట్టాలు, వాటి వల్ల కలిగే అనర్ధాలపై కూడా విద్యార్థులకు వివరించారు. అత్యవసర పరిస్థితులలో ఉపయోగపడే హెల్ప్‌లైన్ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## కోనలో వైభవంగా నృసింహుని స్వర్ణ గరుడోత్సవ సేవ

**రాపూరు, మే 29, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి శుక్రవారం స్వర్ణ గరుడోత్సవ సేవ నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, చందనాలంకారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి శాంతి హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారి నిత్యకళ్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అత్యంత ప్రీతిప్రాతమైన స్వర్ణ గరుడవాహనంపై శ్రీవారిని వుంచి స్వామివారికి క్షేత్రోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిం చారు.మంగళవాయిద్యాలు, గిరిజన వాయిద్యాల మధ్య నిర్వహించిన స్వామివారి స్వర్ణ గరుడవాహన క్షేత్రోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావల్సిన భోజన,వసతి ఏర్పాట్లును ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి పర్యవేక్షణలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య,పెంచలస్వామి,హరిష్ ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి,పెంచల పెంచలయ్య స్వామి,ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి,అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాపూరు ఎస్ఐ కె. తిరుమల రావు తదితరులున్నారు.



## తహసీల్దార్‌కు టీడీపీ నేతల ఘన సన్మానం

**వింజమూరు, మే 29, ప్రభాతవార్త** వింజమూరు మండల తహసీల్దార్ ఎస్.డి. హమీద్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ తన అనుచర నాయకులతో కలిసి తహసీల్దార్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు. శనివారంతో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ముందస్తుగా తహసీల్దార్‌ను కలిసి టీడీపీ నేతలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ తహసీల్దార్ హమీద్ ఎలాంటి పక్షపాత ధోరణి లేకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ తన విధులను సమర్ధవంతంగా నిర్వహించారని కొనియాడారు. విధి నిర్వహణలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సర్వీస్ పూర్తి చేసుకొని నేడు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతర జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగపట్ల వెంగయ్య, కోడూరు నాగిరెడ్డి, శ్రీనివాసులు, నీలం పెరుమాళ్ళ, ఆరికొండ శ్రీనివాసులు, గురజాల గోపి, కొండపల్లి వెంకటేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## మహానాడు సక్సెస్ - కన్వీనర్ కృతజ్ఞతలు

**వింజమూరు, మే 29, ప్రభాతవార్త :** వింజమూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మే 27, 28 తేదీలలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మండల టీడీపీ కన్వీనర్ గూడా నర్సా రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి, ఎండను సైతం లెక్కచేయకుండా కార్యక్రమం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు పేరుపేరునా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. పసుపు జెండాను భుజాన వేసుకుని పనిచేస్తున్న కార్యకర్తలే పార్టీకి నిజమైన బలమని, వారి త్యాగాల వల్లే టీడీపీ ఈ స్థాయిలో ఉందని కొనియాడారు.ఈ రెండు రోజుల మహానాడులో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, కార్యకర్తల సంక్షేమంపై చర్చించి తీర్మానాలు చేశారు. ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని, ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం పనిచేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామంలో బూత్ కమిటీలను పటిష్టం చేసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని కన్వీనర్ నర్సారెడ్డి సూచించారు. వింజమూరు మండలాన్ని టీడీపీకి కంచుకోటగా మారుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, యువత, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 4వ డివిజన్‌లో నారాయణ నేత్రజ్యోతి, దంత సురక్ష ఉచిత వైద్య శిబిరం

**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు నగర ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించి, రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తన సొంత నిధులతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖినారాయణ నేత్రజ్యోతిఖి మరియు ఖినారాయణ దంత సురక్ష ఉచిత వైద్య శిబిరం ప్రస్తుతం నగరంలోని 4వ డివిజన్, జాకీర్ హుస్సేన్ నగర్ న్యూకాలనీ వద్ద అత్యంత విజయవంతంగా జరుగుతోంది. ఈ కార్యక్రమం పై నగర అధ్యక్షుడు మామిడాల మధు వైద్యాధికారిని సుధా మాట్లాడుతూ, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను రూపాయి ఖర్చు లేకుండా వారి చెంతకే తీసుకువచ్చిన నారాయణ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ, స్థానిక ప్రజలు మరియు వృద్ధులు ఈ సువర్ణ అవకాశాన్ని అద్భుతంగా సద్వినియోగం చేసుకుంటున్నారని కొనియాడారు. మార్చి 8న ప్రారంభమైన ఈ పథకాల ద్వారా ఇప్పటివరకు 7,600 మందికి పైగా ఉచిత పరీక్షలు నిర్వహించి, 4,700 మందికి పైగా ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశామని వెల్లడించారు.ఈ శిబిరం ప్రత్యేకత ఏంటంటే.. కేవలం కంటి పరీక్షలు చేయడమే కాకుండా, ఆపరేషన్ అవసరమైన రోగులను నారాయణ సొంత రవాణా వాహనాలలో ఉచితంగా హాస్పిటల్‌కు తరలించి, అక్కడ ఆపరేషన్, మందులు మరియు ఆపరేషన్ తర్వాతి చికిత్సను కూడా పూర్తిగా ఉచితంగా అందించి, తిరిగి వారి ఇళ్లకు సురక్షితంగా చేరుస్తున్నారు. ముఖ్యంగా నీటికాసులు, డయాబెటిక్ రెటినోపతీ వంటి వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి అంధత్వాన్ని నివారించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు..ఈ కార్యక్రమంలో నాల్గవ డివిజన్ ప్రెసిడెంట్ నారాయణ రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్‌లు మాల్యాద్రి, సుమన్, మరియు సభ్యులు షఫీ, శేషమ్మ, నిర్మల, సంపూర్ణ, సత్యవతి , స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన కమిటీ సభ్యులతో మాజీ మంత్రి నల్లపరెడ్డి భేటీ

**కోవూరు, మే29ప్రభాతవార్త :** ఈ సమావేశంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4 నుంచి 12 వరకూ వెన్నుపోటుకు రెండేళ్ళు పేరుతో కోవూరు నియోజకవర్గంలో చేపట్టబోయే కార్యక్రమాలపై ,బూత్ లెవెల్ ఏజెంట్లు (బి ఎల్ఎ) లకు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై పూర్తిసాయిలో అవగాహన కల్పించి పార్టీ బలోపేతం దిశగా నూతన కమిటీల విధివిధానాలపై చర్చించి పలు సూచనలు చేసిమాజీమంత్రి వైసీపీ రాష్ట్ర పిఎసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఈ సమావేశంలోకోవూరు నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అనిల్ బాబు,పాల్గొన్నారు



## నెల్లూరు నర్తకీ సెంటర్లో తెలుగు మహిళల గర్జన.. మహానాడు తీర్మానంపై నెల్లూరులో సంబరాలు..

**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు నర్తకీ సెంటర్ సాక్షిగా తెలుగు మహిళలు సరికొత్త ఇతిహాసానికి నాంది పలికారు. మహా నాడు వేదికగా నారీమణులకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న యువ నేత నారా లోకేశ్ చారిత్రాత్మక ప్రతిపా దన పట్ల నెల్లూరు జిల్లా తెలుగు మహిళా విభాగం హర్షోల్లాసాలతో ఊగిపోయింది. ఈ అద్భుత ఘట్టాన్ని పురస్కరించుకుని నర్తకీ సెంటర్ వేదికగా ముందుగా స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అన్న ఎన్టీఆర్, సీఎం నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేశ్ ల చిత్రపటాలకు నారీమణులు భక్తిశ్రద్ధలతో పాలాభిషేకం నిర్వహించి, భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళా పక్షపాత టీడీపీ వర్ధిల్లాలి.చంద్రబాబు, లోకేశ్‌ల నాయకత్వం వర్ధిల్లాలి అంటూ వందలాది మంది మహిళలు చేసిన ఆకాశాన్ని తాకే నినాదాలతో నెల్లూరు నగరం ఒక్కసారిగా హోరెత్తిపోయింది. మొదటినుంచి మహిళా అభ్యున్నతికే కట్టుబడిన పార్టీ టీడీపీ అని, నాడు మహిళలకు చట్టసభల్లో అవకాశం ఇచ్చి, ఆస్తిలో భాగం కల్పించడంతో పాటు సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని, వితంతు పెన్షన్లను ప్రవేశపెట్టిన ఘనత అన్న ఎన్టీఆర్ కే దక్కుతుందని ఈ సందర్భంగా మహిళా లోకం ఘనంగా స్మరించుకుంది.ఇదే వేదికపై నుంచి టీడీపీ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి మాజీ మంత్రి రోజాపై సింహగర్జన చేశారు. తాము రోజాలాగా పూటకో పార్టీ మారే వలస పక్షులం కాదని.. అసలు రోజాది నోరో, లేక తాటిమట్టో అర్థం కావడం లేదంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అధినేత చంద్ర బాబు నాయుడు, స్థానిక మంత్రి నారాయణ ఆదేశాల మేరకు తాము నెల్లూరు అభివృద్ధి పనుల్లో దూసు కుపోతుంటే.అధికారం కోల్పోయినా అహంకారం తగ్గకుండా, ఇంకా ఆ మదంతోనే విర్రవీగుతూ మహానా డుపై రోజా అడ్డగోలు కూతలు కూస్తోందని రేవతి ధ్వజమెత్తారు. కుక్కతోకను ఎంత పీకినా ఎలా వంకర తీర్చలేమో, వైస్సార్సీపీ నేతల బుద్ధిని కూడా అలా మార్చలేమని ఎద్దేవా చేశారు. నాడు 9 శాతంగా ఉన్న మహిళా రిజర్వేషన్ ను నేడు 33 శాతానికి పెంచాలని మహానాడులో చారిత్రాత్మక తీర్మానం చేసి మహిళా పక్షపా తులుగా నిలిచిన సీఎం చంద్రబాబు నాయుడు, యువనేత లోకేశ్ లకు, తమకు అండగా నిలుస్తున్న మంత్రి నారాయణకు నెల్లూరు తెలుగు మహిళల తరపున కపిర రేవతి శతకోటి కృతజ్ఞతలు తెలియ జేశారు.డిప్యూటీ మేయర్ తాసిన్,52వ డివిజన్ కార్పొరేటర్ రేష్మా, 54వ డివిజన్ కార్పొరేటర్ సఫీయా, స్టేట్ మహిళా నాయకురాలు భూలక్ష్మి,క్లస్టర్స్ శైలమ్మ,అన్నపూర్ణ, 3వ డివిజన్ అధ్యక్షురాలు విజయమ్మ ,మహిళా క్లస్టర్స్ శ్రీలక్ష్మి, శిల్ప, గౌసియా, చందన , పెద్ద ఎత్తున టిడిపి మహిళా నేతలు , నాయకురాలు తదితరులు పాల్గొన్నారు



## సర్వాయపాలెం ఉన్నత పాఠశాల నందు బడిబాట ర్యాలీ

**కావలి, మే 29 ప్రభాతవార్త :** మండలంలోని సర్వాయపాలెం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల నందు బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించడమే లక్ష్యంగా ఉపాధ్యా యులు, విద్యార్థులు బోధనేతర, సిబ్బంది గ్రామ ప్రజలు కలసి బడిబాట–రా..బడి పిలుస్తుంది అనే భారీ ర్యాలీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించడం జరిగింది హెచ్ఎం తోట వెంకటే శ్వర్లు మాట్లాడుతూ ఎంతో అనుభవం విద్యా, నైపుణ్యాలు, కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యబోధన, విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ బ్యాగులు, యూనిఫామ్స్, షూస్, బెల్టు అందించడమే కాక, మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన రుచికరమైన మధ్యాహ్నం భోజన వసతి డిజిటల్ క్లాసులు, లైబ్రరీ పాల్ ల్యాబ్, విశాలమైన ఆట స్థలం, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని తెలిపారు. కావున ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న మన పాఠశాల నందు మీ పిల్లలను చదివించి వారి ఉజ్వల భవిష్యత్తులు బాటలు వేయండని పిలుపునిచ్చారు. అనంతరం బడిబాట ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈకార్యక్రమంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు జి.రాములు, ఆంగ్ల ఉపాధ్యా యులు సిహెచ్ చెంచయ్య తెలుగు ఉపాధ్యాయులు కెవిరత్నం, జూనియర్ అసిస్టెంట్ అలహరి, సాయికు మార్, రికార్డు అసిస్టెంట్ ఇండ్ల కిరణ్ కుమార్, సిఆర్‌పి బుజ్జయ్య, ఉపాధ్యాయునిలు తదితరులు పాల్గొన్నారు.



## జక్కా వెంకయ్య సేవలు చిరస్మరణీయం

**విడవలూరు, మే 29ప్రభాతవార్త:** పేద, బడుగు, బలహీన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన కామ్రేడ్ జక్కా వెంకయ్య సేవలను సీపీఎం నాయకులు స్మరించుకున్నారు. ఆయన 8వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు.నాయకులు మాట్లాడుతూ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమం, భూ పోరాటాల్లో జక్కా వెంకయ్య కీలక పాత్ర పోషించారని తెలిపారు. వేలాది ఎకరాలను భూమిలేని పేదలకు అందించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. సాగునీరు, వ్యవసాయ రంగాలపై ఆయనకు విశేష అవగాహన ఉండేదని, ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించి జైలు శిక్షలు కూడా అనుభవించారని పేర్కొన్నారు.సీపీఎం పార్టీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## ప్రమాదాన్ని ముందే పసిగట్టిన విద్యుత్ శాఖ అధికారులు

**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త – వైద్యం** ప్రమాదాన్ని ముందే పసిగట్టిన విద్యుత్ శాఖ అధికారులు 120 టన్నుల భారీ క్రేన్‌తో టవర్‌ను నిలబెట్టి భారీ ప్రమాదం నివారణ నేషనల్ హైవేపై యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టిన విద్యుత్ శానెల్లూరు టౌన్ పరిధిలో నేషనల్ హైవేపై విద్యుత్ శాఖ అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమ యంలో, నేషనల్ హైవేపై ఉన్న ఎం ప్లస్ 9 టవర్ ప్రమాదకరంగా వంగి కూలిపోయే స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు భారీ ప్రమాదాన్ని నివారిం చేందుకు హుటాహుటిన 120 టన్నుల భారీ క్రేన్ ను తెప్పించి టవర్‌ను డమ్మీ చేసి భద్రతా చర్యలు చేపట్టారు.భారీ క్రేన్ సహాయంతో టవర్‌కు సపోర్ట్ పనులు చేపడుతూ, నెల్లూరు టౌన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీల్ కుమార్ గారు, ఏఈ శ్రీ గోపాల కృష్ణ అక్కడే ఉండి పనులను పర్యవేక్షిం చారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ సంఘటనా స్థలానికి చేరుకొని అత్యవసర పనులను స్వయంగా పర్యవేక్షించారు. ప్రజలకు ఎలాంటి ప్రమా దం కలగకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటూ యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ శాఖ అధికారుల సమ యస్ఫూర్తి, సమన్వయంతో తీసుకున్న చర్యల వల్ల భారీ ప్రమాదం తప్పి, నేషనల్ హైవేపై ప్రయాణిస్తున్న ప్రజలకు భద్రత కల్పించబడింది.



## గాలి, వాన బీభత్సం

**నెల్లూరు, కడప జిల్లాల్లో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు**

**యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు : ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి**

**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త – వైద్యం** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, కడప జిల్లాల్లో గురువారం రాత్రి బలమైన గాలి, వర్షం కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప జిల్లాలోని కొండాపురం, మైదుకూరు, మైలవరం, జమ్మల మడుగు, ప్రొద్దుటూరు గ్రామీణ, దువ్వూరు, రాజుపాలెం, చాపాడు మండలాల్లోని 28 గ్రామాల్లోనూ, నెల్లూరు జిల్లాలోని కావలి గ్రామీణ, కొండాపురం, కోవూరు, ముత్తుకూరు, జలదంకి, దగదర్తి, అల్లూరు మండలాల్లోని 15 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలియజేశారు. బలమైన గాలి, వర్షం కారణంగా ఈ రెండు జిల్లాల్లో 26 ఫీడర్లు, 114 కి.మీ. మేరకు విద్యుత్ లైన్లు, 213 స్తంభాలు, 131 ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతిన్నాయన్నారు. తద్వారా ఈ రెండు జిల్లాల్లో 19 మండలాలల్లోని 35 గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, ఆయా సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ల పర్యవేక్షణలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు.



## కిశోర్ వికాసంలో విద్య ప్రాధాన్యతపై అవగాహన

**రాపూరు, మే 29, ప్రభాతవార్త :** కిశోర్ వికాసంలో బాగంగా రాపూరు సెక్టార్ పరిధిలోని వెంకటేశ్వరపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 15 నుండి 18 సంవత్సరాల బాలికలకు విద్య వల్ల కలిగే ప్రాధాన్యతపై ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాన్ని సెక్టార్ సూపర్‌వైజర్ రాధిక వివరించారు. ప్రతి ఒక్కరు చదువుకోవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని, వారికి చట్టంలో వున్న హక్కులు తెలుస్తాయన్నారు. బడి ఈడు పిల్లలందరూ తప్పని సరిగా బడికి వెళ్లి చదువుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, కిశోర బాలికలు వున్నారు.

## వాహనదారులు రవాణా నిబంధనలు పాటించాలి

**రాపూరు, మే 29, ప్రభాతవార్త :** వాహనదారులు తప్పని సరిగా రవాణా శాఖ నిబంధనలు పాటించాలని గూడూరు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉషా రాణి ఆదూరి కోరారు. శుక్రవారం ఆమె రాపూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇటీవల ప్రమాదాలకు కారణమైన వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా వారి వాహనానికి సంబందించిన ఫిట్‌నెస్ సర్టిఫికేటు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలు కలిగి వుండాలన్నారు. డ్రైవర్‌కు తప్పని సరిగా లైసెన్స్ వుండేలా చూసుకోవాలని చెప్పారు. ప్రయాణికుల ఆటోకు సంబందిచి పరిమితి మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాల్సి వుందన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని కోరారు.

## ఈదురు గాలులతో విద్యుత్ సరఫరా కు అంతరాయం

**బిట్రగుంట మే 29 ప్రభాతవార్త:** బోగోలు మండలంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈదురు గాలుల వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. 33 కెవి విద్యుత్తు లైను మరమ్మత్తులు గురి కావడంతో రాత్రి 12 గంటల నుండి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్కో ఏయి జడ రాయ తన సిబ్బందితో అప్రమత్తమై విద్యుత్ సరఫరాను పునరుద్దరింపజేశారు.

## చలివేంద్రం ప్రారంభం

**అల్లూరు, మే 29 ప్రభాతవార్త :** అల్లూరు రిజిష్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం తెలుగుదేశం నాయకులు బండి శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి తారకరామారావు జయంతిని పురష్కరించుకొని టిడిపి సీనియర్ నాయకుఉలు బీద గిరిధర్ సహకారంతో మండువేసవిలో దాహార్థుల కోసం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అంబటి రాము, గూపి మల్లికార్జున, మునిరాజా, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బైకుపైనుండి పడి మహిళకు తీవ్రగాయాలు

**సీతారామపురం మే 29 ప్రభాతవార్త :** బైకు పై ప్రయాణిస్తు కళ్ళు తిరిగి కిందపడి ఉదయగిరి మండలం బిజ్జంపల్లి,అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన హుసేన్ బి అనే మహిళకు తలకు బలమైన గాయం తగలింది. బిజ్జం పల్లిగ్రామానికి చెందిన హుసేన్ బి ఖాదర్‌వలి దంపతులు బైకుపై మార్కాపురం గిద్దలూరు దగ్గర వున్న బైనవపల్లి గ్రామానికి వెళ్ళి తిరిగి ఇంటికి వస్తు సీతారామపురం సీమీపాన వున్న గ్రీన్ ఫీల్డ్ హైవేవద్ద కళ్ళు తిరిగి ఒక్కసారిగా ముందుకు పడడంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో ఆమెను ఉదయగిరి ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

## కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

**తోటపల్లి గూడూరు, మే 29, ప్రభాతవార్త :** నరుకూరులోని జానావారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలిక వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట సమగ్ర శిశు అభివృద్ధి సేవల ప్రాజెక్టు అధికారి లక్ష్మీదేవి పాల్గొని బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. మంచి ఆహారపు అలవాట్లు అలవరుచుకోవాలని, ఆకర్షణలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. అలాగే సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని బాలికలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్‌కే మస్తానమ్మ, ఎం. మస్తానమ్మ, కవిత, జి. అనురాధ, సుల్తానా, ప్రశాంతి పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సిఐ గంగాధర్

**ఆత్మకూరు,మే29,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలో సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో సిఐ గంగాధర్, ఎస్ఐ జంపని కుమార్ ట్రాఫిక్ నియంత్రణకోసం పట్టణంలో పరిశీలించారు. ప్రధాన వీధిలో షాపుల ఎదుట వాహనాలు నిలపరాదని, రోడ్డుకు అవతల నిలిపి కొనుగోలు చేసి వెళ్ళిపోవాలని సూచించారు. సాయంత్రం వేళల్లో అన్ని వాహనాలు పట్టణంలో రాకపోకలు ఉన్నందున రద్దీ ఉంటుందని ఈ సమయంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పట్టణంలో అన్ని ప్రాంతాలు పరిశీలిస్తున్నట్లు సిఐ తెలిపారు.

## కిశోరి బాలికలు విద్య, కెరీర్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

ఆత్మకూరు,మే29,ప్రభాతవార్త: కిశోరీ బాలికలు విద్య ప్రాముఖ్యతను, కేరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాల అభివృద్ధిని పెంపొందించుకోవాలని ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చెర్లో యడవల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద కిశోరి వికాసం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్య జీవితాన్ని వెలుగుల బాటలో నడిపిస్తుందని, విద్యవలన జ్ఞానం,నైపుణ్యం, ఆత్మవిశ్వాసం లభిస్తుందని, మంచి విద్య మంచి భావితరానికి పునాది అన్నారు. విద్య మనం మంచి పౌరులుగా మరడానికి సహాయపడుతుందన్నారు. విద్య మన జీవన ప్రమాణాన్ని మెరుగుపరుస్తుందన్నారు. కావున కిశోరి బాలికలు విద్య ప్రాముఖ్యత గురించి తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. అదే విధంగా మన జీవితంలో ఎలా ముందుకు సాగాలనే విషయాల గురించి తెలుసుకోవాలని , వృత్తిపరమైన విజయానికి అత్యంత కీలకం నైపుణ్యం. ఇది ఉద్యో అవకాశాలను మెరుగుపరచడమే కాక జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కొనేందుకు సహాయ పడుతుందన్నారు. కావున కిశోర బాలికలు ఈ వేసవి శిక్షణా శిబిరాల్లో ఈవిషయాల గురించి అవగాహన పెంపొందించుకొని భవిష్యత్తులో ముందుకు సాగాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. కావున కిశోరి బాలికలు ఈ విషయాలపై అవగాహన పెంచుకొని ముందుకు సాగాలన్నారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కస్తూరి, ఎఎన్ఎం రాజేశ్వరి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరోష, విజయమ్మ, శాంతి,వసంత , కిశోరి బాలికలు పాల్గొన్నారు.

## ఉదయం వేడిగాలులు..రాత్రి ఈదురుగాలులు

**కోట, మే 29 ప్రభాతవార్త :** జిల్లాలో ఉదయం రాటెత్తించిన ఎండలు.రాత్రికి విరుచుకుపడిన ఈదురు గాలులతో ప్రజలు అల్లాడిపోయారు. పలుచోట్ల చెట్లు నేలవాలాయి. గురువారం రాత్రి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులు దుమ్ముధూళి పైకిలేచి నివాసాలను కమ్మేసింది. వాహనచోదకులు రహదారి కనిపించక అవస్థలు పడ్డారు. అయితే వేడిగాలులకు వాతావరణం మారి ఈదురు గాలులు రావడంతో వాతావరణం కాస్త చల్లబడింది. ఈ అకాల వర్షం మామిడి రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. పంట చేతొకిచ్చే దశలో ఈదురు గాలులు కారణంగా మామిడికాయలు రాలిపోయాయి.

# ముస్లీంల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

## టిడిపి నాయకుడు జలీల్‌ఆహ్మద్



**కోట,మే 29 ప్రభాతవార్త** ముస్లింల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ కటుబడి ఉందని జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీసెల్ అధ్యక్షులు షెక్ .జలీల్ ఆహ్మద్‌అన్నారు. బక్రీద్ పండగను పురస్కరించుకుని కోటలోని ఎస్కె సహకారంతో గ్రీన్ పౌండేషన్ ఆద్వర్యంలో లక్షా యాభైవేలు విలువ చేసి పొట్టేళ్లను కోసి కర్భనీ మాంసంను ఆయన చేతుల మీదగా పం పిణీ చేశారు. ప్రతిఏటా బక్రీద్ పండగను పుర్కసరించుకుని ఆయన కర్భనీని పంపిణీ చేయడం అనవాయితీగా వస్తోంది. ఆశ్రమంలోనే వందలాదిమంది ముస్లీంలకు కర్భనీని పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతు మసీదులు ,ఈద్గాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మధుయాదవ్,ఎంపిటిసిలు షంషద్దీన్, నౌషాద్,గ్రీన్ పౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతు బాంధవుడు జక్కా వెంకయ్య



**బిట్రగుంట మే 29 ప్రభాతవార్త:** రైతు బాంధవుడు, కార్మికుల పక్షపాతి కామ్రేడ్ జక్కా వెంకయ్యని కావలి డివిజన్ సిపిఎం సీనియర్ నేత తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. మండల సిపిఎం కార్యాలయ ఆవరణంలో శుక్రవారం కామ్రేడ్ జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరు నియోజకవర్గం శాసన సభ్యులుగా ఉన్నప్పుడు ఈ ప్రాంత రైతాంగానికి ఆయన చేసిన కృషిని, కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి చేసిన కృషిని ప్రశంసించారు. ఆయన మార్గదర్శకంగా ప్రతి ఒక్క కమ్యూనిస్టు సోదరుడు పనిచేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం నేతలు పాల్గొన్నారు.

## కోవూరు ఏఎస్‌డబ్ల్యూవోకు ప్రత్యేక పర్ఫామెన్స్ అవార్డు



**(కోవూరు, మే29ప్రభాతవార్త :** సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఇటీవల ప్రకటించిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో కోవూరు ఏఎస్‌డబ్ల్యూవోగా పనిచేస్తున్న పాలకీర్తి తిరుపతయ్య ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కావలి పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకుగానూ శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ చేతులమీదుగా ప్రశంసా పత్రం, మెమెంటోను స్వీకరించారు. విజయవా డలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన టాప్ పర్ఫామెన్స్ అవార్డు కార్యక్రమంలో భాగంగా తిరుపతయ్యను ప్రత్యేకంగా సన్మానించారు. వసతి గృహాల నిర్వహణ, పిల్లల చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉత్తమ ఫలితాలతో పాటుఅత్యధిక మార్కులు సాధించినందుకు ఈ బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డును తిరుపతయ్య పొందారు. రాష్ట్రం మొత్తం మీద 5 మందికి మాత్రమే ఈ అవార్డు ఇవ్వగా.. అందులో నెల్లూరు జిల్లా కావలి ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూ తిరుపతయ్యకు రావడం అభినందనీయమని సహచర ఏఎస్‌డబ్ల్యూలు, సంక్షేమాధికారులు ప్రత్యేకంగా ఆయనను అభినందించారు.

## సాయి అపర్ణకు దాతల ప్రోత్సాహం మెండు



**(కోవూరు, మే29ప్రభాతవార్త :** కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామానికి చెందిన సాయి అపర్ణ ఇటీవల వెలువడిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా స్థాయిలో రెండవ స్థానం నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి గుమ్మలదిబ్బ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరును వెలుగులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో కోవూరుకు చెందిన సుభాష్ సేవా సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి కుమార్తె తులసీ రెడ్డి అపర్ణను ప్రత్యేకంగా కలిసి ఆ విద్యార్థికి కావల్సిన 10 జతల దుస్తులు, ఒక బ్రీఫ్‌కేస్ , ఒక వాచ్‌ను అందించి అపర్ణకు తాము ఉన్నామంటూ భరోసా ఇచ్చారు. ఇప్పటికే అనేకమంది దాతలు అపర్ణకు తమవంతుగా సహకారం అందించి మానవత్వం ఇంకా మిగిలి ఉందని నిరూపించుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున, సుభాష్ సేవా సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డిలు అపర్ణకు సంబంధించి విషయాన్ని ఫేస్‌బుక్‌లోనూ, సోషల్ మీడియాలోనూ పెట్టడంతో అది పూర్తిగా అందరికీ చేరి తమవంతుగా ఆ పేదింటి బిడ్డకు సహకారం అందించడం పట్ల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నెల్లూరు రూరల్, మే 29, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నుంచి భారీగా తరలివచ్చిన నేతలు,కార్యకర్తలు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26 డివిజన్లు, 18 గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ నేతలు,కార్యకర్తలు తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. డివిజన్ స్థాయి నాయకులు పుష్పగుచ్చాలు, శాలువాలతో శుభాకాంక్షలు తెలియజేయగా, సామాన్య కార్యకర్తలు, గ్రామీణ ప్రాంత ప్రజలు తమకు చేతనైన చిన్న కానుకలు, పండ్లు తీసుకువచ్చి అభిమాన నేతకు అందించారు. కార్యాలయం మొత్తం అభిమానులతో కిటకిటలాడింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని 16 నెలల కాలంలో ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదురైనా పార్టీ కార్యకర్తలను, నాయకులను కాపాడుకుంటూ ముందుకు నడిపించిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కష్టాన్ని కార్యకర్తలు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు."అన్న కోసం కష్టకాలంలో నిలిచిన ప్రతి కార్యకర్తను మరువలేం" అంటూ పలువురు నాయకులు భావోద్వేగంగా మాట్లాడారు. ఒంటిచేత్తో నెల్లూరు రూరల్ రాజకీయాల్లో తన ముద్ర వేసిన గిరిధర్ రెడ్డికి కార్యకర్తలు అపారమైన మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా పెద్ద ఎత్తున కేక్ కటింగ్, శుభాకాంక్షల కార్యక్రమాలు నిర్వహించగా, అభిమానులు నినాదాలతో కార్యాలయాన్ని మార్మోగించారు.

## గాలి భీభత్సం నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు

### విద్యుత్ శాఖకు అపారనష్టం




**కోవూరు, మే29ప్రభాతవార్త** కోవూరు మండలంలో శుక్రవారం తెల్లవారుజామున వీచిన భారీ పెనుగాలులకు విద్యుత్ శాఖకు అపారనష్టం సంబవించింది. అకస్మాత్తుగా వీచిన ఈ దురుగాలులకు మండ లంలోని పలు ప్రాంతాల్లో 31 విద్యుత్ స్తంభాలపై చెట్లు పడడంతో అవి విరిగిపోయి విద్యుత్ సరఫరాకు పూర్తిస్థాయిలో అంతరాయం ఏర్పడింది. వేగూరు, సీతారామపురం, చెర్లోపాలెం, లేగుంటపాడు, పోతిరెడ్డిపాలెం గ్రామాల్లో 8 గంటల పాటు విద్యుత్ సరఫరాకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌రెడ్డి, ఏఈలు మునిరాజా, గిరిధర్, లైన్‌మెన్లు, విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన పడిన పోల్‌లను ఎత్తి సరఫరాను సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టారు. మండలంలో 8 గంటల పాటు విద్యుత్ సరఫరాకు పూర్తిగా అంతరాయం ఏర్పడడంతో పలుచోట్ల మంచినీటికి ప్రజలు అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. తాలూకా కార్యాలయ ప్రాంగణంలో కూడా విద్యుత్ సరఫరా లేక పలు శాఖల అధికారులు ఇబ్బందులకు గురయ్యారు.

## మాజీ ఎమ్మెల్యేని కలిసిన వేమిరెడ్డి దంపతులు



**కావలి, మే 29 ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో శుక్రవారం 26వ వార్డుకు చెందిన ఇన్‌చార్జ్ వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, ప్రసూన దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం వేమిరెడ్డి దంపతును మాజీ ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి వార్డులోని పలు విషయాలపై చర్చించడం జరిగింది.

# స్వాతి నక్షత్రం సందర్భంగా వేదగిరిపై స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, హోమాలు



**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ మండలం, నరసింహకొండ పై వేదగిరి క్షేత్రగా వెలసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం స్వాతి నక్షత్రము విశేష పర్వదినం సందర్భంగా స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకము, అలాగే శ్రీ ఆది లక్ష్మి అమ్మవారికి శుక్రవారం సందర్భముగా పంచామృత అభిషేకము, తిరుప్పావడ సేవ, ఆర్జిత కళ్యాణం, శ్రీ లక్ష్మి నరసింహ మహా సుదర్శన హోమ శాస్త్రవేత్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి నక్షత్రం స్వాతి నక్షత్రం అయినందున, శుక్రవారం వచ్చినందున విశేషంగా వివిధ సేవలు అత్యంత వైభవంగా దేవస్థాన ప్రధాన అర్చక స్వామి మాధవగిరి భాస్కరాచార్యులు నేతృత్వంలో అర్చక స్వాములు మాధవగిరి కృష్ణమాచార్యులు, మాధవగిరి అప్పలాచార్యులు, మాధవగిరి నరసింహమూర్తి నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర రెడ్డి, కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి, శ్రీధర్ నాయుడు, భాస్కర రెడ్డి, పలగాని శ్రీహర్షారెడ్డి, యాలమూరు రంగయ్య నాయుడు, మల్లికార్జున రెడ్డి, అళహరి విజయకుమార్, భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్న కావలి ఏఎస్‌డబ్ల్యుఓ తిరుపతయ్య



**కావలి, మే 29 ప్రభాతవార్త** :కావలి పరిధిలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గానూ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు సాంఘీక సంక్షేమశాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి, ప్రిన్సిపల్ సెక్రటీర నాయక్ సాంఘీక సంక్షే మ డైరెక్టర్ లావణ్య వేణి చేతుల మీదగూ కావలి ఏఎస్‌డబ్ల్యుఓ పాలకీర్తి తిరుపతయ్య మెమెంటో, ప్రశం సాపత్రాన్ని అందుకోవడం జరిగింది. వసతి గృహాలు నిర్వహణ, వసతి గృహ విద్యార్థుల చదవుల విషయం లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉత్తమ ఫలితాలతో పాటు అత్యధిక మార్కులు సాధించినందుకు ప్రత్యేకంగా అభి నందించడం జరిగింది. బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు రాష్ట్రం మొత్తం 5మంది ఏఎస్‌డబ్ల్యుఓలకి అందజేయడం జరిగింది. ఇందులో నెల్లూరుజిల్లాలో కావలి ఏఎస్‌డబ్ల్యుఓ తిరుపతయ్య అందుకోవడం అభినందనీయం అని పలువురు కొనియాడి ప్రశంసించారు.

## మినరల్ ఆర్‌ఓ ప్లాంటు ప్రారంభం రోటరీక్లబ్ సేవా కార్యక్రమాలను అభినందించిన ఎమ్మెల్యే




**కావలి, మే 29 ప్రభాతవార్త :** కావలి ఆర్టీసి బస్టాండు ఆవరణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రయాణీకులకు ఉచిత మినరల్ వాటర్ ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఆర్టీసి జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డితో కలసి శుక్రవారం ప్రారంభించి ఎమ్మెల్యే నీటిని తాగి నాణ్యతపై వివరించారు. అక్కడే ఉన్న ప్రయాణీకులకు కూడా స్వచ్ఛమైన అందజేశారు. అనంతరం ఆర్టీసి కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణీకులు వచ్చే ఆర్టీసి బస్టాండులో తాగునీటి సౌకర్యం ఎంతో అమసరమని తెలిపారు. ఆర్‌ఓ ప్లాంటుతో ఆరోగ్యకరమైన తాగునీరు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. రోటరీ క్లబ్ ఇలాంటి సేవలతో మందుకు రావడం అభినందనీయంటూ క్లబ్ అధ్యక్షులు రమేష్‌రెడ్డిని అభినందించారు. పట్టణంలో ప్రజలకు ఉపయోగపడే మరెన్నో సేవా కార్యక్రమాలను కోటరీక్లబ్ చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తోందని కొనియాడారు. పరిశుభ్రత కోసం నిరంతం శ్రమిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది సేవలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వంకట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి డిపో మేనేజర్ డి.ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజర్ కల్పన, రోటరీక్లబ్ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలి : కమిషనర్




**నెల్లూరు కార్పోరేషన్, మే 29 ప్రభాతవార్త** :నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైట. నందన్ పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్య వేక్షణలో భాగంగా స్థానిక జిఎస్‌టి రోడ్డు లక్ష్మి షాపింగ్ మాల్ పరిసర ప్రాంతాలలో అధికారులతో కలసి శుక్రవారం పర్యటించారు. ట్రంకు రోడ్డులో ఎండ్‌టుఎండ్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన మార్కింగ్ పనులను టౌన్ ప్లానింగ్ విభాగంవారు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. మార్కింగ్ పనులు అయిన వెంటనే రోడ్డునిర్మాణ పనులను చేపట్టి నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ అదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతు జానీ, టౌన్‌ప్లానింగ్ విభాగం సర్వేయర్ ఏడుకొండలు, వార్డు సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుడి హుండీ నుంచి బడి భవనానికి ఊపిరి

### ..ఉపాధ్యాయుడి చొరవతో ఊరంతా ఎకమైంది
### ..చీర్ల వారి కండ్రికలో ప్రభుత్వ పాఠశాలకు పునర్‌జన్మ



**చేజర్ల,మే29ప్రభాతవార్త** చేజర్ల మండలం, చీర్లవారికండ్రిక గ్రామంలో ఓ ప్రభుత్వ పాఠశాల కథ ఇప్పుడు అందరికి ఆదర్శంగా మారింది.ఒక ఉపాధ్యాయుడి చొరవ, గ్రామస్థుల ఐకమత్యం, సర్పంచ్ దాతృత్వం, గుడి హుండీ నిధులు కలిసి శిధిలావస్థకు చేరిన బడికి మళ్లీ కొత్త ఊపరి పోశాయి. మన బడి ..మన భాధ్యత అనే భావనతో గ్రామమంతా ఒక్కటై నిలిచిన ఈ ఘటన స్థానికంగా ప్రశంసలు అందుకోంటుందో. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నాడు..నేడు పథకంలో కొత్త భవనం మంజూరైనా. నిధుల కొరత కారణంగా పనులు మధ్యలోనే ఆగిపోయాయి. మరోవైపు పాత పాఠశాల భవనం పూర్తిగా శిధిలావస్థకు చేరింది. గోడల నుంచి పెచ్చులు ఊడిపడుతూ, పైకప్పు ఉరుస్తూ ఎప్పుడు ఏ ప్రమాదం జరు గుతుందో అన్న భయంతో విద్యార్థుళ, ఉపాధ్యాయులు గడపాల్సిన పరిస్థితి ఏర్పాడింది. వర్షం పడితే తరగతులు నిర్వహించేందుకు ఎదురుగా వున్న ఆలయాన్ని ఆశ్రయించాల్సి వచ్చేది. దీంతో తమ పిల్లలను పాఠశాలకు పంపేందుకు తలితండ్రులు కూడా ఆందోళన చెందేవారు. ఇలాంటి సమయంలో పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయునిగా భాధ్యతలు చేపట్టిన పుచ్చకట్ల మల్లికార్జున రావు పరిస్థితిని గమనించి గ్రామ పెద్దలు, ప్రజలతో సమావేశమయ్యారు. మన ఊరి బడిని మనమే కాపాడుకోవాలి అని గ్రామస్థులలో చైతన్యం కలిగించారు. ఆయన పిలుపుకు గ్రామమంగా స్పందించింది. మొదటగా గ్రామ దేవాలయం హుం డీలో ఉన్న రూ.21 వేల నిధులను పాఠశాల మరమత్తుల కోసం వినియోగించాలని నిర్ణయించారు. ఆ తర్వా త పనులు ఆగకుండా సాగేందుకు మల్లికార్జున రావు స్వయంగా రూ. 20 వేలు అందించారు. గ్రామ సర్పంచ్ పంచాయితీ నిధులు మరో రూ. 20 వేలు సమకూర్చి అండగా నిలిచారు. అంతే కాదు గ్రామస్థులు శ్రమ దానం చేసి భవన మరమత్తుల్లో స్వయంగా పాల్గొన్నారు. మహిళలు కూడా సహకరించి పాఠశాల పరి సరాలను అందంగా తీర్చిదిద్దారు. గ్రామస్థుల సహకారంతో ప్రమాదకరంగా వున్న పాఠశాల భవనం ఇప్పుడు విద్యార్థులకు సురక్షితమైన విద్యాలయంగా మారింది. మన ఊరి పిల్లలు మన ఊరి బడిలోనే చదవాలి అన్న సంకల్పంతో గ్రామంలోని పిల్లలందరిని తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఒక ఉపాధ్యాయుని ఆలోచన, ఒక గ్రామం ఐకమత్యం వుంటే ప్రభుత్వ పాఠశాలలను ఎలా అభివృద్ధి చేయవచ్చో చీర్లవారికండ్రిక గ్రామం నిరూపించింది. ఇప్పుడు ఈ పాఠశాల కథ పరిసర గ్రామాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తోంది. ఇదిలా వుండగా ఈ గ్రామానికి ఇరువైపులా వున్న బోగ్గలవారి కండ్రిక,చేజర్లకండ్రిక గ్రామాల్లో పాఠశాలలు మూత పడ్డాయి. తమ పాఠశాలలను ఎలాగైనా కాపాడుకోవాలన్న ఆలోచనతో ఆ గ్రామస్తులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకి పంపుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

## పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం

**సైదాపురం మే 29 ప్రభాతవార్త :** స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జిల్లా పంచాయతీ అధికారి వసుమతి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అందుబాటులో ఉన్న ఎస్ డబ్ల్యు పి సి షెడ్లను వినియోగంలోకి తీసుకొని రావలసిందిగా ఆదేశించారు. ప్రతి నెల ఇంటి పన్నులు తప్పక వసూలు చేయవలసిందిగా అన్నారు. పెండింగ్లో ఉన్న సర్వేలను త్వరితగతన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అభివృద్ధి అధికారి రమణయ్య, ఎంపీడీవో ఎం.వి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వేలూరు కళ్యాణ్ రెడ్డి



**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త – వైద్యం** తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి చేరుకోవాలని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన నెల్లూరు రూరల్ టిడిపి యువ నాయకులు వేలూరు కళ్యాణ్ రెడ్డి గిరిఅన్న మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాను అంటూ జన్మదినశుభాకాంక్షలు తెలియజేశారు

## ఏఎంసీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గుడ్డ సంచుల పంపిణీ



**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త – వైద్యం** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలను నెల్లూరు ఏసీ మార్కెట్లో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కూరగాయల మార్కెట్ వద్ద గిరిధర్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గుడ్డ సంచులను పంపిణీచేశారు. మనుబోలు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో మూడు పూటలా అన్నదానం నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేసి తమ నేత గిరిధర్ రెడ్డికి పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ వ్యాపారులు , నేతలంతా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఎమ్మెల్యే కావాలని మనసారా ఆకాంక్షించారు.

## కుష్టు వ్యాధి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టండి

### డాక్టర్ ఎస్‌కే. ఖాదర్ వలీ



**నెల్లూరు, మే 29, ప్రభాతవార్త – వైద్యం** కుష్టు వ్యాధి నివారణకు వైద్యులంతా సహకరించి లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్కే.ఖాదర్ వలీ పిలుపునిచ్చారు. నెల్లూరు డిఎంఅండి హెచ్ ఓ కార్యాలయంలో ఆయన కుష్టు వ్యాధి నివారణ పై సెక్టార్ వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ నెలలో కొత్తగా గుర్తించిన కుష్టు వ్యాధిగ్రస్తులను వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలు సుకున్నారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి వారికి తగు విధమైన చికిత్స అందించి అంగవైకల్యం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ముఖ్యంగా రొయ్యల గుంతలు , ఇటుక బట్టీల వద్ద సర్వే నిర్వహించాలని సూచించారు . అంగవైకల్యం ఉన్నవారికి ఎస్ ఎస్‌ఓడి ద్వారా వైకల్యాన్ని నిర్మూలించాలని , అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయాలని కోరారు . అంతేకాకుండా కొత్తగా గుర్తించిన కేసులకు వారితో నివాసం ఉంటున్న వారికి వ్యాధి ప్రబల కుండా " పెప్ " మింగించాలని సూచించారు . వ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు . ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఓడి క్యాంపు నిర్వహించాలన్నారు . అవసరమైన వారికి ఎం సి ఆర్ చెప్పులు అందించాలని ఆదేశించారు . ఈ కార్యక్రమంలో న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ ఎం . రమేష్ , డాక్టర్ శాలిని , ఫిజియోథెరపిస్ట్ నరసింహులు , పిఎంఓ మల్లమ్మ , డిపిఎంఓలు , ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు

## కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

### జీజీహెచ్ పారిశుద్ధ్య కార్మికులకు బట్టల పంపిణీ



**నెల్లూరు,మే 29, ప్రభాతవార్త – వైద్యం** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డిగిరిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నగరంలోవాడవాడల ఘనంగా నిర్వహించారు . పార్టీ నాయ కులు కార్యకర్తలు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ మదపర్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జీజీహెచ్ ఏసి సుబ్బారెడ్డి మెడికల్ కళాశాల పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిఆయురారోగ్యాలతో ఉండాలని, మరెన్నో పుట్టి నరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు మొ గరాల సురేష్, దారా మల్లి, బ్రహ్మరెడ్డి ,అబిదాసుల్తానా, తనూజ తదితరులు పాల్గొన్నారు .

## పాఠశాలకి కంప్యూటర్లు వితరణ




**గూడూరు, మే 29, ప్రభాతవార్త** గూడూ రు పట్టణంలోని సంయుక్త నగర్‌లో ఉన్న శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బత్తెన హనుమంతరావు కుమారుడు బత్తెనసనత్ కుమార్ (సన్ని) జ్ఞాపకార్థం పాఠశాలకుఅవసరమైన రెండు కంప్యూటర్ సిస్ట మ్స్ వారి తండ్రి శ్యామల హార్డ్వేర్ అండ్ పెయింట్ అధి నేత సీనియర్ రొటేరియన్ బత్తిన హనుమంతరావు సూచనలతో పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డికి రోటరీ అధ్యక్షుడు వి. వెంకటేశ్వర్లు రెడ్డి అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. సేవాతోనే సంతృప్తి అన్నారు.ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు వి. వెంకటేశ్వర్లు రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఫాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ పాఠశాల కార్యదర్శి డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ సీనియర్ రొటేరియన్స్ పివి కృష్ణయ్య, డాక్టర్ ఎస్ వి నాగేంద్ర ప్రసాద్, ఎన్ వి రత్నం, రోటేరియన్స్ కిరణ్ చక్రవర్తి డి ఆర్ డబ్ల్యు కాలేజ్ ప్రిన్సిపాల్ హనుమంతరావు, ప్రెసిడెంట్ ఎలక్ట్ తిరుమూరు సురేష్ రెడ్డి, సెక్రటరీ ఎలెక్ట్ నాగ సునీల్,పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు సనత్ కుమార్ రెడ్డి, రామ్మోహన్, రవీంద్ర రెడ్డి, ప్రధానాచార్యులు వి. రంగనాయకులు, ఉపాధ్యాయ ఉపాధ్యాయునులు, అలఘనాథ స్వామి దేవస్థానం చైర్మన్ బత్తిన సుధాకర్ రావు, బత్తిన హనుమంతరావు బంధువులు బత్తిన శ్రీనివాసులు, గుండాల రవి, బుజ్జి, పవన్, శరత్, ద్వారక, తదితరులు పాల్గొన్నారు.

## హాకీ టోర్నమెంట్ ప్రారంభం



**గూడూరు, మే 29, ప్రభాతవార్త** అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరుగుతున్న ఎమ్మెల్యే కప్ 2026కు గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే స్నేహితుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎమ్మెల్యే కప్ 2026ను మొదటి రోజు మన జాతీయ క్రీడ హాకీతో ప్రారంభించడం మంచి పరిణామమని ఎమ్మెల్యే స్టేడియంలో చేసిన అభివృద్ధికి కృతజ్ఞతగా వారి స్నేహితులందరూ ఐదు రోజులపాటు క్రీడా పోటీలు నిర్వహించడం ఒక ప్రత్యేకమైనదని తెలిపారు. ఎమ్మెల్యే మీద వారికున్న అభిమానాన్ని, గౌరవాన్ని తెలుపుతుందని చెప్పారు. అదే విధంగా క్రీడాకారులందరూ క్రమశిక్షణతో ఆడాలని మనందరి కోసం అభివృద్ధి చేసిన ఈ స్టేడియాన్ని అందరం కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మన అందరి మీద ఉందని తెలిపారు. స్నేహితులు జరిపే కార్యక్రమంలో నన్ను కూడా భాగస్వామిని చేసినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, రజనీకాంత్, శనగ మస్తాన్, ఇబ్రహీం, సుమన్ రెడ్డి, విజయ్ కుమార్, సుబ్రహ్మణ్యం, అరుణ్ కుమార్, హాకీ కోచ్ దీపక్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



**సైదాపురం మే 29 ప్రభాతవార్త :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, సరైన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని, సైదాపురం ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని వాహనాలపై, అదేవిధంగా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రోడ్డు మీద నిలిపి ఉన్న వాహనాలపై ఎస్సై దుర్గా ప్రసాద్ జరిమాను విధించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు, ఎక్కడ బడితే అక్కడ బస్టాండ్ ప్రాంతంలో వాహనాలు రాకపోకులకు ఇబ్బందులు కలిగే విధంగా నిలిపితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.